

శిథిలం.. భయం భయం

ముధోల్ తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. 9లో▸

రాష్ట్రస్థాయి బహుమతి



సోన్: బాలల దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కథా రచన పోటీల్లో న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. పదో తరగతి చదువుతున్న మోత్కూరి శరణ్య రాసిన కథ రాష్ట్రస్థాయి బహుమతికి ఎంపికైంది. ఈనెల 15న హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం చేస్తారని ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.2 / 18.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. వేకువజామున మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

డీఈవోగా రామారావు



రామారావు

నిర్మల్ రూరల్: జిల్లాకు నూతన డీఈవోగా రామారావు నియమితులయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రామారావును నిర్మల్ డీఈవోగా నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు చేశారు. స్థానిక డీఈవో రవీందర్‌రెడ్డి ఇప్పటికే మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. నిజామాబాద్ ఏడీ నాగజ్యోతిని మొదట డీఈవో నియమించింది. వ్యక్తిగత కారణాలతో ఆమె జాయిన్ కాలేకపోయింది. దీంతో మంగళవారం రామారావును ఫుల్ చార్జ్ డీఈవోగా బదిలీ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రవీందర్‌రెడ్డి బుధవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక



మహేశ్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

లక్ష్మణచాంద: రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి మహేశ్ ఎంపికయ్యారు. మండలంలోని కనకాపూర్ అక్షర హైస్కూల్‌కు చెందిన విద్యార్థి వి.మహేశ్ ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల కరస్పాండెంట్ నరేశ్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాము, పీఈటీ భూక్యా ప్రేమ్‌కుమార్ విద్యార్థిని సన్మానించారు.

బేస్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి బేస్‌బాల్ అండర్–14, 17 బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 15 న నిర్మల్ జిల్లాలో జరిగే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ రమణారావు, సాఫ్ట్ బాల్ కార్యదర్శి అన్నపూర్ణ, బ్యాడ్మింటన్ కార్యదర్శి భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, గిరి, భూమేష్ , సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న హెచ్చెం, సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రం సమీపంలోని డ్యాంగపూర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థి బి.కృష్ణ ఈనెల 16, 17 తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని హెచ్‌ఎం అనూష తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు పీడీ రమేష్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలి

సోన్: రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ సూచించారు. రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం పాల్గొన్నారు. రైతులు యాసంగి పంటల సాగులో అధిక దిగుబడి సాధించాలంటే ఆధునిక పద్ధతులు అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ భాస్కర్, ఏవో వినోద్‌కుమార్, ఏఈవోలు ఉమామహేశ్వరి, ప్రగతి, అశోక్, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ... మారదా గతి..?

- వర్సిటీలో అంతా గోప్యమే..
- సూసైడ్ నోట్ బయట పెట్టని అధికారులు
- తల్లి ఆరోపణలపై మౌనం...
- జరిగింది చెప్పరు.. జవాబు ఇవ్వరు..



ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్వాతిప్రియకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

భైంసా: ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్య అందించాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేసిన బాసరలోని ఆర్జీయూకేటీలో అంతా రహస్యమే. లోపల ఏం జరిగింది.. ఏం జరుగుతోంది అనేది ఎవరూ బయటకు చెప్పరు. బయట నుంచి వచ్చే ఆరోపణలపై స్పందించరు. ఏ ఘటన జరిగినా గోప్యంగా ఉంచడం కామన్ అయింది. తాజాగా పీయూసీ–2 విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్యపైనా వర్సిటీ అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. క్యాంపస్‌లో ఏదైనా ఘటన జరిగితే బాధితుల తల్లిదండ్రులు, బంధువులు కూడా గేటు బయటనే నిరీక్షించాల్సిందే. ఇక మీడియా, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు అసలే అనుమతి ఉండదు.

వివరాలు ఇవ్వరు...

పీయూసీ2 చదువుతున్న విద్యార్థిని పూరి స్వాతిప్రియ ఆత్మహత్య సంఘటనపై వాస్తవాలు తెలుసుకునేందుకు సోమవారం క్యాంపస్‌లోకి వెళ్లేందుకు యత్నించిన తల్లిదండ్రులు, కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ముందే గార్డులు విద్యార్థి సంఘం నాయకులపై దాడిచేసి కొట్టారు. ఈ సంఘటనలో ఏబీవీపీ నాయకుడు సాయికుమార్ తల పగిలింది. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. చదువుకునే క్యాంపస్‌లో దాడులు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, బాధ్యులపై చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల మౌనం..

ఆత్మహత్య విషయంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా క్యాంపస్ అధికారులు నోరు మెదపలేదు. సూసైడ్ లెటర్ బయటకు వచ్చినా.. మీడియాకు మాత్రం సమాధానం ఇవ్వలేదు. సూసైడ్ లెటర్ ఉందన్న విషయం కూడా ప్రకటించలేదు. విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడిన ప్రతీసారి అధికారులు ఏ విషయాన్ని బయటకు చెప్పడంలేదు. రహస్యంగానే అన్ని విషయాలు ఉంచుతున్నారు. గోప్యత ఎందుకు పాటిస్తున్నారన్న విషయం అంతుచిక్కడం లేదు. ఆత్మహత్య జరిగిన అనంతరం క్యాంపస్ అధికారులు మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడించాలి. కానీ, ఒక ప్రకటన వాట్సప్ గ్రూప్‌లో పోస్టుచేసి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అనుమానాలెన్నో..

ఇప్పటి వరకు బాసర ట్రిపుల్‌ఐటీలో 22 మంది ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు అధికారులు సైతం పూర్తిస్థాయిలో విచారణ జరిపితేనే వాస్తవాలు బయటకు వస్తాయని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. ఆత్మహత్యకు ప్రేరేపించే వాతావరణం ఎందుకు కల్పిస్తున్నారని చాలా మంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువుకునేందుకు వెళ్లిన విద్యార్థులు శవాలుగా మారి ఇళ్లకు రావడం తల్లిదండ్రుల పుట్టెడు దుఃఖాన్ని మిగిలిస్తోంది. ఇప్పటికైనా క్యాంపస్ అధికారులు ఆత్మహత్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఆత్మహత్యలకు కారణాలను వెల్లడించాలి. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి.

సారీ మమ్మీ.. సారీ.. డాడీ..

ఇదిలా ఉంటే.. ఆత్మహత్య చేసుకున్న పీయూసీ2 విద్యార్థి స్వాతిప్రియ సూసైడ్ లెటర్ తాజాగా బయటపడింది. 'సారీ మమ్మీ.. సారీ డాడీ.. నేను ఇలా చేస్తున్నందుకు బాధగా ఉంది మమ్మీ.. నాకు చచ్చిపోవాలనిపిస్తుంది. ఆత్మహత్య చేసుకోవాలంటే భయమేస్తోంది.. ఎందుకో చాలా భారంగా ఉంది.. మమ్మీ మీకు కూతురులా కాదు... కొడుకులా ఉందామనుకున్న. కానీ ఉండలేకపోతున్నా... నా చావుకు ఎవరూ కారణం కాదు. నేను చచ్చిపోయాక మీరు చాలా బాధపడుతారని తెలుసు. కానీ నేను ఏమీ చేయలేకపోతున్నాను. నేను దూరమయ్యాక మా ఫ్రెండ్స్ అందరికీ, ఆన్‌లైన్ ఫ్రెండ్స్‌కు స్వాతి ఈజ్ నో మోర్ అని మెసెజ్ పెట్టండి. లేదంటే నేను మెసెజ్ పెట్టడంలేదని ఫీల్ అవుతారు. అక్క నేను జయసు అన్నకు రూ.800 ఇవ్వాలి. నా ఫోన్‌పేలో ఉన్నాయి. నువ్వు ఇచ్చేయ్ అక్క. నా ఫోన్‌లో అన్నయ్య అని నంబర్ సేవ్‌చేసి ఉంటుంది. డాడీ స్మోకింగ్ మానేయాలి. ఐ మిస్‌యూ సో మచ్. ఐ లవ్ యూ మమ్మీ.. డాడీ అక్క, తమ్ముడికి ఎలాంటి బ్యాడ్ హాబిట్స్ అలవాటు అవ్వద్దు. ఒకేనా. అక్క నా ఫ్రెండ్స్, నా ఫ్యామిలీ ఎవరూ వచ్చిన నన్ను ఒకసారి హగ్‌చేసుకోండి. బతికి ఉన్నప్పుడు ఎలాగో నన్ను హగ్‌చేసుకోలేదు. కనీసం ఇప్పుడైనా హగ్‌చేసుకోనివ్వండి. డాడీ నువ్వు మాల వేసుకున్నావ్. అయినా ఇలా చేస్తున్నా తప్పట్లేదు. సారీ డాడీ. నా బాడీ అవయవాలు దానం ఇవ్వండి. నా ఫోన్ మా అక్క తప్ప ఎవరూ చూడాల్సిన అవసరం లేదు. కాల్స్ వచ్చిన, మెసేజ్ వచ్చినా అక్కని రెస్పాండ్ అవ్వమని చెప్పండి. నా లాస్ట్ కోరిక మన వినోద్ అన్నను పెదనాన్న వాళ్లు అనాథ ఆశ్రమంలో వదిలేశారు. ఆ అన్న రోడ్లమీద భిక్షం అడుక్కుంటున్నాడంట. అన్నకి మంచిగా ఫుడ్ పెట్టి బాగా చూసుకోండి. నేను లేని లోటు అన్న తీరుస్తాడు. మీరు ఎవరెవరితో గొడవ పడ్డారో వారందరు వచ్చేలా చూడండి. తాత పక్కన నన్ను పూడ్చిపెట్టండి. తాతతో ఉన్నట్లు అనిపిస్తుంది. మమ్మీ... అక్క, తమ్ముడు వాళ్లను బాగా చూసుకో. వాళ్లకి నచ్చిన స్టడీ చేయించు. తమ్ముడికి హాస్టల్‌లో ఉండాలని లేదు. కాబట్టి బయటనే జాయిన్ చేయండి. స్వాతి ఈజ్ నో మోర్...' అని ఆరు పేజీల సూసైడ్ లేఖ రాసింది.

సమగ్ర సర్వే పక్కాగా చేపట్టాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య



జిల్లా కేంద్రంలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్/లక్ష్మణచాంద: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పటిష్టంగా చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. నిర్మల్ పట్టణంలోని ఏఎన్.రెడ్డి కాలనీ, రాంనగర్‌లో, లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే కోసం హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా ఇళ్లకు అంటించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారం సేకరిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ప్రతీ కుటుంబంలోని ఒక్కో వ్యక్తి పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లలో సర్వే పూర్తయింది.. కుటుంబ వివరాల సేకరణ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? కొత్తగా గమనించిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఏ చిన్న తప్పిదానికి తావులేకుండా నిర్ణీత కోడ్‌లను పొందుపరుస్తూ స్పష్టమైన సమాచారంతో సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతీ ఎన్యూమరేటర్ రోజుకు సగటున కనీసం 15 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లకు సలహాలు, సూచనలు ఇస్తూ, సర్వే ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. ప్రతీ ఎన్యుమరేటరు సమయానికి నిర్దేశించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌లో సర్వే చేపట్టాలన్నారు. సర్వే నిర్వహించే కుటుంబాల సభ్యులు ఎవరైనా అందుబాటులో లేకుంటే వారి గుర్తింపు పత్రాల ఆధారంగా వివరాలు నమోదు చేయాలన్నారు. లక్ష్మణచాంద మండలంలో మొత్తం 1,0308 గృహాలకు, ఇప్పటివరకు 1,558 గృహాల సర్వే పూర్తయిందని ఎంపీడీవో రాధ ప్రత్యేక అధికారికి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, తహసీల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

లక్ష్మణచాంద: ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పీచర గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. సన్నరకం ధాన్యం ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్లు సేకరించారు.. ఇంకా ఎన్నిక్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్‌లు రైతులకు అందుబాటులోఉంచాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, సివిల్ సప్లయ్ డీఎం వేణుగోపాల్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీసీవో రాజమల్లు, డీపీవో అంజిప్రసాద్, ఎంపీడీవో రాధ పాల్గొన్నారు.



ధాన్యం తేమను పరిశీలిస్తున్న కృష్ణ ఆదిత్య

14న 108లో పైలెట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108లో పైలెట్ ఉద్యోగాల నియామకాలకు ఈనెల 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గాధం మధుకుమార్, జిల్లా కోర్డినేటర్ లింగాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ ప్రాంగణంలోని 108 అంబులెన్స్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూ కొనసాగుతుందన్నారు. అభ్యర్థుల వయసు 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక జిరాక్స్ సెట్‌తో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు 10 తరగతిపాసై 5.5 అంగుళాల ఎత్తు కలిగి ఉండి, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌తో పాటు బ్యాచ్ నంబర్ కలిగి ఉండాలన్నారు. వివరాలకు 9177449022, 9676757584, 9440252141 సంప్రదించాలని సూచించారు.

వొకేషనల్ శిబిరాన్ని సందర్శించిన డీఐఈవో

ఖానాపూర్: పట్టణంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణంలో ఆన్ ది జాబ్ ట్రెనింగ్‌లో భాగంగా శిక్షణ పొందుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ గ్రూప్ క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల శిబిరాన్ని డీఐఈవో పరుశురాంనాయక్ మంగళవారం సందర్శించారు. అధ్యాపకుల సూచన మేరకు శిక్షణ పొందిన వారికి శిక్షణ అనంతరం మార్కులు కూడా వేస్తామని తెలిపారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుభాష్, నాగరాజు, రఘువీర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవంపై సమావేశం

బాసర: కార్తిక మాసం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి రోజు గోదావరి పుష్కర ఘాట్ వద్ద నిర్వహించే కార్తిక దీపోత్సవంపై ఆలయ వైదిక బృందం, అధికారులు సమీక్ష నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లు, వివిధ పూజ కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు కల్పించే సౌకర్యాలపై ఈవో విజయరామారావు సమీక్షించారు. సమావేశంలో ఆలయ చైర్మన్ శరత్ పాఠక్, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధానార్చకులు సంజీవ్ పూజారి, అర్చకుడు మదన్ దీక్షిత్ వేద పండితులు నవీన్‌శర్మ, పీఆర్వో నారాయణపటేల్ పాల్గొన్నారు.



సమావేశంలో ఆలయ ఈవో, అర్చకులు

పెంబి మండలంలో పెద్దపులి

- 'బుర్కరేగడి'లో ఎద్దును హతమార్చిన బెబ్బులి
- ధ్రువీకరించిన అటవీ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని అటవీ గ్రామాల ప్రజలకు సూచన



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

పెంబి: మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి పక్షం రోజులుగా జిల్లాలోనే సంచరిస్తోంది. సారంగాపూర్, కుంటాల, నర్సాపూర్(జి) మండలాల్లో సంచరించిన బెబ్బులి.. ఆదివారం రాత్రి చించోలి(బి) సమీపంలో మహబూబ్ గాట్స్‌పై రోడ్డు దాటుతూ వాహనదారుల కంటపడింది. అక్కడి నుంచి తాండ్ర రేంజ్ పరిధిలోని పెంబి మండలంలోకి వచ్చిన పులి.. అంకె గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్కరేగడి గ్రామంలో కుమురం గంగాధర్ తన చేనులో కట్టేసిన ఎద్దుపై సోమవారం రాత్రి దాడి చేసి చంపేసింది.

అప్రమత్తంగా ఉండాలి..

ఎద్దును హతమార్చింది పెద్దపులే అని అటవీ అధికారులు ధ్రువీకరించారు. మండలంలో పులి సంచరిస్తున్నందున అటవీ గ్రామాల ప్రజలు, గిరిజనులు, ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. అడవులను ఆనుకుని ఉన్న రాయదారి, వస్‌పెల్లి, దొందారి, చాకిరేవు, పస్పుల తదితర అటవీ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. గేదెలు, మేకలు, ఆవులను కాపరులు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లొద్దన్నారు. మైదాన ప్రాంతాల్లోనే మేపాలని పెంబి ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు సూచించారు. పంటల రక్షణకు విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చొద్దని పేర్కొన్నారు.

పులి కనిపించింది..



అంకెన గ్రామ సమీపంలోని మైదానంలో గొర్రెలను మేపుతుండగా ఒర్రె ఒడ్డున ఉన్న పొదలోకి పెద్దపులి వచ్చింది. దానిని చూసిన గొర్రెలు భయపడ్డాయి. తన వెంట వచ్చిన కుక్క బెదిరి చెల్లాచెదురయ్యాయి. నేను గమనించి అక్కడి నుంచి పారిపోయాను. సాయంత్రం కష్టం మీద గొర్రెల మందను గ్రామంలోకి తీసుకొచ్చాను.

– గుడిసె రమేశ్, అంకెన గ్రామం

ఖానాపూర్ మండలంలో అప్రమత్తం..

ఖానాపూర్: జిల్లాలో పక్షం రోజులుగా సంచరిస్తున్న పులి.. ఖానాపూర్ డివిజన్‌లోకి వచ్చే అవకాశం ఉండడంతో అటవీ అధికారులు అలర్ట్ అయ్యారు. ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, దేవునిగూడెం, గోండుగూడ తదితర గ్రామాల్లో ఖానాపూర్ రేంజ్ అధికారులు, సిబ్బంది పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంటరిగా పొలాలు, చేల వద్దకు వెళ్లొద్దని సూచించారు. పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పొలాలకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయవద్దని తెలిపారు.



దేవునిగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

ధాన్యం తూకం వేశాకే సర్వే చేయాలి

- సమగ్ర కుటుంబ సర్వేను అడ్డుకున్న రైతులు



ధర్మోర పంచాయతీ వద్ద సర్వేను ఆపాలని నిరసన తెలుపుతున్న రైతులు

లోకేశ్వరం: ధాన్యం తూకం వేశాకే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలని, అప్పటి వరకు సర్వే నిలిపివేయాలని మండల రైతులు డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, ధర్మోర గ్రామాల్లో రైతులు పంచాయతీ కార్యాలయాలను మంగళవారం ముట్టడించారు. ధాన్యం తూకం వేసేవరకు సమగ్ర కుటుంబ సర్వే నిలిపి వేయాలని రైతులు ఆందోళన చేశారు. కేంద్రాలను ప్రారంభించి నెల రోజులు అయినా నేటికీ ధాన్యం తూకం వేయడం లేదన్నారు. తూకంలో జాప్యంతో చాలా మంది రైతులు దళారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ధాన్యం తూకం వేసే వరకు సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించమని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సైన్స్ ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పు చేసేందుకు ఏడాదికోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా సిలబస్‌లో ఉన్న సుమారు 20 ప్రయోగాలను 40 మంది ఉపాధ్యాయులతో చేయించారు. కార్యక్రమాన్ని సెక్టోరియల్ అధికారులు రాజేశ్వర్, లింబాద్రి, ప్రవీణ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయని తెలిపారు. బోధన కార్యక్రమాలు మెరుగుపర్చుకోవచ్చని సూచించారు. విద్యార్థులను ప్రభావితం చేయడంలో ప్రయోగాలు ఉపయోగపడతాయన్నారు. అగస్త్య ఫౌండేషన్ అధికారులు అనిల్ కుమార్, వెంకటరెడ్డి, సురేశ్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ ప్రయోగాలను వివరించారు. వ్యర్థాలను ఉపయోగంలోకి తేవడం ద్వారా తక్కువ ఖర్చుతో కూడిన పరికరాలతో ప్రయోగాలను చేయించడం, తదితర అంశాలపై చర్చించి ప్రయోగం ద్వారా చేసిచూపారు. శిక్షణలో జేపీఎన్ఆర్ ప్రిన్సిపాల్ మణికుమారి, డీఎస్‌వో వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు కూన రమేశ్, రఫీక్, సంతోష్, అన్సార్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై చర్య తీసుకోవాలి



ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో అక్కడికి వెళ్లిన ఏబీవీపీ కార్యకర్తలపై దాడిచేసిన వర్సిటీ సెక్యూరిటీ సిబ్బందిపై చర్య తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్ ఉన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

ట్రిపుల్‌ఐటీ ఘటనలో ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడిని నిరసిస్తూ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్ కోరారు.

కాలంచెల్లిన మందుల వినియోగంపై విచారణ



ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న శ్రీనివాసప్రసాద్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆగస్టు 9న కాలం చెల్లిన మందులతో రోగులకు చికిత్స అందించిన విషయమై మంగళవారం విచారణ జరిగింది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్ డీసీహెచ్ఎస్ శ్రీనివాసప్రసాద్ విచారణ చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందితోపాటు మందులను పంపిణీ చేసిన అధికారులు, సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులను పరిశీలించారు. సంఘటనపై తదుపరి చర్యల నిమిత్తం నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి కృష్ణవేణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

తాండూర్: ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బారేవాడకు చెందిన ఇడిదినేని నాగయ్య తన ఇంటి సమీపంలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి పరిసరాల్లో వెతకగా గంజాయి మొక్కలు కనిపించాయి. మొక్కలు స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ



చోరీకి గురైన హోండా యాక్టీవా

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని కనకాపూర్‌లో హోండా యాక్టీవా (టీఎస్18జి 0462) చోరీకి గురైనట్లు ఎస్సై సుమలత తెలిపారు. గ్రామానికి చెందిన రాజేందర్ ఎప్పటిలాగే ఇంటి ముందు తన స్కూటీని పార్క్ చేశారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని అపహరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం తరలింపుపై కేసు నమోదు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం సమీపంలో సోమవారం రాత్రి పట్టుబడిన రేషన్ బియ్యం తరలింపుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. నంబాల గ్రామానికి చెందిన మధుకర్ ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా గూడెం సమీపంలో పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయని, వాటి విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

'జిత్తుల మారి' చిక్కింది



కెమెరాకు చిక్కిన నక్క

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్ వివిధ రకాల వన్యప్రాణులకు ఆవాసం. పలు ప్రాంతాలలో రకరకాల వన్యప్రాణులు నివాసం ఉంటున్నాయి. ఇందులో అరుదుగా కనిపించేవి నక్కలు. అటవీశాఖ అధికారులు అమర్చిన కెమెరాకు జిత్తుల మారి నక్క చిక్కింది.

అలంకారప్రాయమేనా..!?

రామకృష్ణాపూర్ పట్టణంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ లబ్ధిదారులకు అందించడంలోని వైఫల్యమే ఈ దుస్థితికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయి అర్హుల జాబితా సిద్ధం చేసినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం లేదు. పర్యావసానంగా అర్హుల ఎంపిక జాబితా కూడా పనికి రాక.. అసలు లబ్ధిదారులకు అవి పంపిణీ కాక నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత పాలకులేమో కానీ ప్రస్తుత ప్రభుత్వమైనా కనీసం ఈ ఇళ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కోట్లాది రూపాయలు వృథా అయ్యే పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఎటూ తేలకుండా పోతున్న 286 డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- రూ.15.16 కోట్లు వెచ్చించి నిర్మించినా ఫలితం శూన్యం
- అర్హుల జాబితా ప్రకటించినా పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక
- శిథిలావస్థకు చేరుకుంటున్న ఇళ్లు



ఆర్‌కేపీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



ధ్వంసమైన కిటికీ అద్దాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.15.16 కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో 286 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కేవలం ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం, లైటింగ్, తదితర చిన్నపాటి పనులు చేపడితే ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కానుంది.

అర్హుల జాబితా ప్రకటించినా...

వాస్తవానికి రామకృష్ణాపూర్ పట్టణంలో చాలామంది నిరుపేదలున్నారు. అప్పట్లో సింగరేణి ఆధీనంలో ప్రభుత్వ స్థలాలు ఉండటంతో భయంభయంగా కొందరు సొంతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పట్టాలు లేక పరేషాన్ అయిన సందర్భాలూ ఉన్నాయి. ఎట్టకేలకూ గత ప్రజాప్రతినిధుల చొరవ.. సింగరేణి యాజమాన్యం నిర్ణయంతో అధికారికంగా పట్టాలు జారీ చేయడంతో ఈ సమస్య గాడినపడింది. ఇదే సమయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టడంతో తమకు ఇల్లు వస్తుందన్న ఆశతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 286 ఇళ్లకు వేలాది దరఖాస్తులు రాగా ఎట్టకేలకూ అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితా సైతం మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేశారు. అనివార్యంగా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ పడకేసింది.

శిథిలావస్థకు డబుల్ ఇళ్లు..

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం జరిగి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తున్నా పంపిణీ ప్రక్రియ చేపట్టకపోవటం విమర్శలకు దారితీస్తోంది. రూ.15.16 కోట్ల ప్రజాధనం వృథా కానుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి వృథాగా ఉంటుండడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గతంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిపివేసి వాటి స్థానంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలన్న సంకల్పం మట్టికరుచుకుపోవడం విమర్శలకు ప్రధాన కారణం. ప్రస్తుతం అదే ఇందిరమ్మ ఇళ్ల పథకం పునరావృతం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టినా అసలు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏం చేస్తారనే దానిపై స్పష్టత కరువైంది. ఇప్పటికైనా నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని పరిగణలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిలువ నీడ కల్పించాలని విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వ స్పందనపైనే ఈ ఇళ్ల అంశం ఆధారపడి ఉందనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెక్రెటరీ బి.బాబురావు వెల్లడించారు. ఈ నెల 9, 10 తేదీల్లో బెల్లంపల్లి కేంద్రంగా రాష్ట్రస్థాయి బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

బాలికల విభాగంలో...

టి.నేహశ్రీ, ఎం.గంగోత్రి, జె.శ్రావ్య, ఎస్.మహేశ్వరి (నిజామాబాద్), ఆర్.అలేఖ్య, డి.సుమిత్రా, అభినయ, కె.కృష్ణ శ్రీ, ఎస్.సుహంత్రి (మెదక్), పి.అనిత, కేతావత్ త్రిష (మహబూబ్‌నగర్), జి.మన్యశ్రీ, ముప్పిడి అశ్రిత (వరంగల్), జె.గాయత్రి, ఏ.వర్షిణి (ఆదిలాబాద్), బి.వైష్ణవి (కరీంనగర్) ఎంపికయ్యారు. వీరితో పాటు కే.వేదశ్రీ (నల్గొండ), ఐ.నవనీత (మెదక్), ఎం.ప్రీతి (నిజామాబాద్)ను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.

బాలుర విభాగంలో...

రాజ్‌పుట్ వక్కీ, వడాయ్ గోపాల్, జె.ప్రభాస్, బి.సిద్ధార్థ (ఆదిలాబాద్), రమావత్ దేవీప్రసాద్, జాదవ్ కిషన్, హలవత్ జగన్, జారుపుల తరుణ్ (మెదక్), యు.రామ్‌చరణ్, జి.శ్రీచేతన్ (మహబూబ్‌నగర్), ఐ.అశ్విజ్, జి.ప్రసాద్ (నిజామాబాద్), పి.సాయి (నల్గొండ), కనకం గణేశ్ (వరంగల్), ఆర్. రామ్‌చరణ్ (రంగారెడ్డి), కె.మల్లికార్జున్ (హైదరాబాద్)ను ఎంపిక చేశారు. వీరితో పాటు పి.కళ్యాణ్‌రాజు (ఖమ్మం), ఎం.మణికంఠ(ఆదిలాబాద్), జనగాం సాయిచరణ్ (మెదక్)ను స్టాండ్‌బైగా ఎంపిక చేసినట్లు బాబురావు ప్రకటించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: హత్యాయత్నం కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాందా సమీపంలో గల రుద్రదాబాలో ఈ నెల 10న రాత్రి శాంతినగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ మోయిన్‌పై తిర్పెల్లికి చెందిన శంషీర్‌ఖాన్, శన్నుఖాన్, మహ్మద్ అక్బర్ కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితునికి తీవ్ర గాయాలయ్యాయి. శంషీర్ ఖాన్‌పై ఇదివరకు పది కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. గంజాయి, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. రౌడీషీట్ కూడా ఉందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు


ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



సతీష్(ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తలారి సతీష్ (22) రెండేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి తిరిగివచ్చాడు. ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లి సాయవ్వ, చెల్లి వాణితో కలిసి ఉంటున్నాడు. దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక సోమవారం రాత్రి ఇంటి ముందున్న పోల్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులోంచి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం



గాయాలపాలైన గంగామణి

ముధోల్: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల సమీపంలో మంగళవారం ఓ మహిళ నడుస్తున్న బస్సులోంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిజామాబాద్‌కు చెందిన గంగామణి తన భర్త గంగాధర్‌తో కలిసి తన అమ్మమ్మ ఊరైన దేగానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో దేగాం నుండి నిజామాబాద్‌కు వెళ్తుండగా బస్సులోంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. అంతకు ముందు భార్య భర్తలు గొడవపడ్డట్లు గంగాధర్ తెలిపారు. ప్రయాణికులు 108కు సమాచారం అందించడంతో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మద్యం మత్తులో పురుగుల మందు ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కామాయిపేట పంచాయితీ పరిధిలోని ఆలిగూడకు చెందిన కోట్నాక్ చిన్ను (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం తన పంటచేనులో మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం పంట చేనుకు వెళ్లిచూడగా శవమై కనిపించాడు. మృతునికి భార్య లక్ష్మిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు..

తలమడుగు: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అంజమ్మ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పల్లి (బి)కి చెందిన కుమ్ర శివకాంత్ (19) ఈనెల 7న ఉదయాన్నే మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లపేటకు చెందిన ఓరుగంటి సతీశ్(25) టాటా ఏసీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11న ఇంట్లో నుంచి వెళ్లిపోయి మంగళవారం వరకు కూడా ఇంటికి రాలేదు. సతీశ్ భార్య రమ్య తన భర్తకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

విద్యార్థిని మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూరి స్వాతిప్రియ మృతికి మంగళవారం సంతాపం ప్రకటించారు. క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థిని చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి వర్సిటీ తరఫున ప్రగాఢ సంతాపం తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అవినీతి కేసులో జైలుశిక్ష, జరిమానా

లక్సెట్టిపేట(మంచిర్యాల): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఓ ఉద్యోగికి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ జైలుశిక్ష, జరిమానా విధించారు. 2013లో పట్టణంలో డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తొగరి పోచయ్య ముత్యంపల్లికి చెందిన ఫర్టిలైజర్ దుకాణం యజమాని సురేందర్ వద్ద రూ.4వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిషోర్ కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో మంగళవారం నిందితునికి అండర్ సెక్షన్ 7 ప్రకారం మూడేళ్ల జైలు, రూ.3వేల జరిమానా, అండర్ సెక్షన్ 13(1) (ఛీ)ట/ఠీ 13 (2) ప్రకారం నాలుగేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఒకరికి ఏడాది జైలు

నర్సాపూర్(జి): ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒక మహిళ మృతికి కారకుడైన చిట్టి పెద్ద ముత్యంకు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు మంగళవారం తీర్పు నిచ్చినట్లు ఎస్సై హన్మాండ్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ మహేందర్ సింగ్ తెలిపారు. 2016 నవంబర్ 11న లక్ష్మణచాంద మండలం తిర్పెల్లికి చెందిన చిట్టి పెద్ద ముత్యం బైక్‌పై వెళ్తూ బతుకమ్మ ఆడుతున్న మహిళలను ఢీకొట్టాడు. ఘటనలో దుర్గి ప్రేమల, దోడోల్ల ప్రేమల అనే ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ దుర్గి ప్రేమల మృతి చెందింది. రాంపూర్ గ్రామానికి చెందిన రావణ భాస్కర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాం నర్సింహారెడ్డి కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.దేవేందర్ 10 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్.అజయ్ కుమార్ మంగళవారం పైవిధంగా తీర్పు వెలువరించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా నిర్వాహకులను మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయ సమీపంలో శాంతినగర్‌కు చెందిన షేక్ ఖయ్యుం, బంగారిగూడకు చెందిన జాదవ్ సంజీవ్ మట్కా నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1,100 నగదుతో పాటు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అందరూ ఉన్నా.. అనాథలా

- కుటుంబ సభ్యులతో కలిసి ఉండలేక..
- మందమర్రిలో ఒంటరిగా...
- అనాథాశ్రమంలో చేర్పించాలని వేడుకోలు..



తిరుపతిరెడ్డి

మందమర్రిరూరల్: కన్నబిడ్డలతో పాటు కట్టుకున్న భార్య కూడా శత్రువులా మారి ఇంటి పెద్దను ఇబ్బందులు పెడుతుండడంతో కుటుంబంతో కలిసి ఉండలేక చనిపోవడం చేతగాక అందరూ ఉన్నా అనాథలా జీవిస్తున్నాడు ఓ వృద్ధుడు. మందమర్రి పట్టణంలోని రామకృష్ణాపూర్ రోడ్డు పాలచెట్టు సమీపంలో గల బతుకమ్మ ఘాట్‌కు చెందిన పాముకుంట్ల తిరుపతిరెడ్డి(90)కి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కరీంనగర్ జిల్లా వావిలాల నుంచి 45 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మందమర్రికి వచ్చి ఎడ్లబండిపై సామగ్రి చేరవేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పైసాపైసా కూడబెట్టి బతుకమ్మ ఘాట్ పక్కన ఐదు గుంటల స్థలం కొనుగోలు చేసి అందులో ఇల్లు కట్టాడు. తన పేరిట ఉన్న రెండెకరాల భూమిని అమ్మి కూతురు పెళ్లి వైభవంగా జరిపించాడు. ఇటీవల మందమర్రిలోని ఇంటిని ఓ ప్రైవేట్ డాక్టర్‌కు విక్రయించి జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్దామని కుమారుడు చెప్పడంతో జగద్గిరిగుట్ట ఏరియాలో ఓ ఇంటిని కొనుగోలు చేసి అక్కడికి మకాం మార్చారు. కుటుంబ సభ్యులతో కొంతకాలం బాగానే కలిసి ఉన్నారు. ఇటీవల కుటుంబ సభ్యుల వేధింపులు ఎక్కువ కావడంతో వారితో ఉండలేక తిరిగి మందమర్రికి వచ్చి ఒంటరిగా జీవిస్తున్నాడు.

ఎముకలు కొరికే చలిలోనే జీవనం...

రెండున్నర నెలల క్రితం జగద్గిరిగుట్ట నుంచి మందమర్రికి వచ్చిన తిరుపతిరెడ్డి స్థానిక ఎంవీటీసీ పక్కనగల ఖాళీ స్థలంలో ఎముకలు కొరికే చలిలోనే ఉంటున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం కంటే చనిపోవడం మేలని, తనను ఎవరైనా ఏదైనా వృద్ధాశ్రమంలోనే ఉంచాలని తనను కలిసిన ప్రతీ ఒక్కరిని వేడుకుంటున్నాడు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో ప్రారంభించిన డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజియన్ కార్గో ఆఫీసర్ బి.పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కార్గో ఆధ్వర్యంలో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు, వ్యాపారులకు కార్గో అందిస్తున్న డోర్ డెలివరీ సేవలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన సర్వీస్‌తో ఇంటి వద్దకే పార్శిల్లను అందజేయడం జరుగుతుందన్నారు. జంట నగరాల పరిధిలోని 31 ఆర్టీసీ కార్గో కౌంటర్లకు బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, వ్యాపార సంస్థలకు డోర్ డెలివరీ ద్వారా తమ సరుకులను పంపించే వీలు కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీజీ రెడ్డి, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాయన్న, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అన్సార్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కార్గో సిబ్బంది

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని తల్లిపై ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పోలీస్ అధికారుల సంఘ సభ్యులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతిప్రియ తల్లి ఉజ్వలపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ జానకీషర్మిలకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ఆత్మహత్య సమాచారం రావడంతో బాసర ఎస్సై గణేష్ అక్కడికి చేరుకుని వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆరు పేజీల లేఖ రాసిందని తెలిపారు. భైంసా ఆస్పత్రి వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్సై గణేశ్ కాలర్ పట్టుకుని తన కూతురును చంపేశారని ఉజ్వల నిలదీసిందని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సై కాలర్ పట్టుకోవడమే కాకుండా నిరాధార ఆరోపణలు చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌టౌన్: ఏబీవీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చిన ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై చర్య తీసుకోవాలని ఏబీవీపీ కార్యకర్తలు ఎస్పీ జానకీ షర్మిలకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని, 11 నెలలుగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాకేశ్, సెక్యూరిటీ ఏజెన్సీ, లేడీ వార్డెన్ కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నారని ఎస్పీకి తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యపై ఏబీవీపీ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా, సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో దాడి చేశారని పేర్కొన్నారు. బాధ్యులపై కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల అరెస్ట్

బాసర: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సోమవారం విద్యార్థిని మృతి ఘటనపై నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో సెక్యూరిటీ సిబ్బంది శ్రీనివాస్, దత్తహరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్క్‌ఫ్రమ్ హోం పేరుతో సైబర్ మోసం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సరిత వద్ద వర్క్ ఫ్రమ్ హోం పేరుతో సైబర్ మోసగాళ్లు రూ.3 లక్షల 90వేలు కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 9న సరిత తన ఇన్‌స్టాగామ్‌లో యాడ్ చూస్తుండగా వర్క్ ఫ్రమ్ హోం అని వచ్చింది. దీన్ని చూసిన బాధితురాలు వారిని సంప్రదించగా కంపనీ నిబంధనల ప్రకారం వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించిన పనిని అప్పగించారు. ఇందుకు రూ.వెయ్యి కట్టమని కొంతపనిని అప్పగించారు. ఇందుకు అకౌంట్‌లో రూ.3,900 వేశారు. వాటిని తీసుకునేందుకు రూ. 5 వేలు కట్టమన్నారు. ఇలా తనుచేసిన టాస్కులకు సంబందించిన డబ్బులు అకౌంట్‌లో వేశారు. కానీ వాటిని డ్రా చేసుకునేందుకు కొంత అమౌంట్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో పలు ధఫాలుగా రూ.3 లక్షల 90 వేలు చెల్లించింది. ఆతర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు మంగళవారం ఫిర్యాదు చేసింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



అంజలిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని ఉమ్రి (బి) బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కొడప అంజలి గత నెల 5న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పీడీ రామచంద్రం, హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 15న జమ్మూకశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. సదరు విద్యార్థిని మంగళవారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరడిగొండ: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా మంగళవారం కుప్టి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు 25 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను గుర్తించి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

శిథిలం.. భయం భయం

- పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయ భవనం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


ప్రవేశ ద్వారం వద్ద భవనం దుస్థితి



శిథిలావస్థకు చేరిన ముధోల్ తహసీల్దార్ కార్యాలయ భవనం


ప్రమాదకరంగా పైకప్పు


ఊడుతున్న పెచ్చులు

ముధోల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి కిందపడుతుండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, విధులు నిర్వర్తించే సిబ్బంది జంకుతున్నారు. భవనం నిర్మించి 100 ఏళ్లకు పై అవుతుందని.. విద్యుత్ వ్యవస్థ సరిగా లేదని తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని మండలవాసులు పేర్కొంటున్నారు. భవనానికి మరమ్మతులు చేయించాలని కోరినా పట్టించుకోవడం లేదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నా రు.

నిజాం కాలం నాటిది..

ముధోల్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయం నిజాం కాలం నాటిదని..అప్పట్లో మహారాష్ట్రలోని భోకర్, నాందేడ్ జిల్లాల వ్యవసాయ భూముల వివరాలు ఈ కార్యాలయం భవనంలోనే పొందుపరిచేవారని పూర్వీకులు పేర్కొంటున్నారు. ఈ కార్యాలయ భవనంలో 12 గదులు ఉన్నాయి. మూడు గదులు సబ్‌ట్రెజరీ కా ర్యాలయానికి కేటాయించగా.. ఒక రూంలో ఆధార్‌సెంటర్ నిర్వహిస్తున్నారు. వర్షాలు కురిస్తే గోడలకు విద్యుత్ సరఫరా అవుతుందనే ఉద్దేశంతో మరో రెండు గదులను ఖాళీగా వదిలేశారు. మిగతా గదుల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో చి న్నపాటి వర్షం కురిసినా గదులు ఉరుస్తునాయి. రికార్డులు భద్రపరిచిన గదుల్లో గోడలు తడిగా మారుతున్నాయి.

కొత్త భవనం నిర్మించాలి



తహసీల్దార్ కార్యాలయ భవనం ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్త భవనం నిర్మించి అందులోకి కార్యాలయం తరలించాలి. – పోతన్న, ముధోల్

గదులు ఉరుస్తున్నాయి



ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో గదులు వర్షం కురిసినప్పుడు బాగా ఉరుస్తున్నాయి. దీంతో కార్యాలయంలో వరదనీరు చేరి గోడలు నానుతున్నాయి. విద్యుత్ తీగలు సరిగా లేక అప్పుడప్పుడూ కరెంటు సరఫరా అవుతుంది. విలువైన సామగ్రికి రక్షణ కరువైంది. – నరేశ్, జూనియర్ అసిస్టెంట్

పెచ్చులు ఊడుతున్నాయి



నాకు ఇప్పుడు 85సంవత్సరాలు. నాకు తెలిసినప్పటి నుంచి ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. ఈ భవనం కట్టి సుమారు 100 ఏళ్లవుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – ఎల్లప్ప, కామాటి

ప్రతిపాదనలు పంపాం

భవనం పెచ్చులు ఊడుతోంది.. మరమ్మతులు చేయించాలని రెండు నెలల కిందట ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. 15 రోజుల కింద అధికారులు వచ్చి భవనం పరిశీలించి వెళ్లారు. నిధులు మంజూరు కాగానే భవనానికి మరమ్మతులు చేయిస్తాం.
– శ్రీకాంత్, తహసీల్దార్, ముధోల్

క్లుప్తంగా

'ఏబీవీపీ నాయకులపై దాడి సరికాదు'

భైంసాటౌన్: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య ఘటన నేపథ్యంలో వర్సిటీకి వచ్చిన ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం సరికాదని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం ముగించుకుని భైంసా వచ్చిన ఆయన సోమవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. విద్యార్థిని మృతిపై పూర్తి విచారణ జరపడంతోపాటు ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాగితీగ చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగితీగలను ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈ విషయమై భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ గంగాధర్

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్‌లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బోండ్ల గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రా జారెడ్డి, డైరెక్టర్లు గంగాధర్, నారాయణ, సవీన్, గాండ్ల నవీన్, నారాయణ, భరత్, రాము, సీఈఓ వజీర్, వినయ్, పూసాల నారాయణ, భూమన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అఘోరా


ఆలయం వద్ద అఘోరా, శిష్యబృందం

సోన్: దేశం కోసం, ధర్మం కోసం కాశీ నుంచి రామేశ్వరం వరకు చాతుర్మస(నాలుగు నెలలు)యాత్ర చేస్తున్నట్లు దిగంబర్ అగోరా తెలిపారు. మంగళవారం మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంగణంలో శివాలయం ఏర్పాటు చేయాలని వీడీసీ సభ్యులకు సూచించారు. అనంతరం వీడీసీ సభ్యులు.. అగోరాలకు అల్పాహారం ఏర్పాటు చేసి విరాళం అందజేశారు. కార్యక్రమంలో అగోరాల శిష్యబృందం, ఆలయ పూజారి ఈచార్య రామకృష్ణ, వీడీసీ చైర్మన్ రోడ్డ రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్, జక్క గంగాధర్, పాల్దే భూమయ్య తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో లోకేశ్వరం రాజన్న ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 120మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం వైద్యుడు వెంకటేశ్ యాదవ్‌ను మా అమ్మ–నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సోన్: మంచిర్యాల జిల్లా తాళ్లపేటలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం శ్రీసాయి హైస్కూల్ విద్యార్థి మొగ్గం సన్నీ(తొమ్మిదో తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినర్సయ్య తెలిపారు. మంగళవారం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సన్నీని సన్మానించారు.

గట్టు తవ్వకాలపై ఫిర్యాదు

ఖానాపూర్: పట్టణంలోని సాయినగర్, శ్రీరాంనగర్ కాలనీల మధ్యలో ఉన్న సదర్మాట్ కాలువ గట్టుపై పలువురు జేసీబీలతో తవ్వకాలు చేపట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించడం ద్వారా కాలువ దెబ్బతినే అవకాశం ఉందని పలువురు కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదర్మాట్ ఏఈఈలు వీరన్న, నవీన్ సిబ్బందితో వచ్చి కాలువగట్టుపై తవ్వకాలు చేపట్టి ప్రాంతంలో గుంతను పూడ్చి పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

జోనల్‌స్థాయి పోటీలు

ముధోల్: మండలకేంద్రంలో బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం క్యారంబోర్డు, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

బంగారుగొలుసు ఎత్తుకెళ్లేందుకు యత్నం

కుభీర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లేందుకు యత్నించారని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు రోడ్డుపై నడుస్తున్న గ్రామానికి చెందిన యువకుడి సెల్‌ఫోన్ దొంగలించారు. వెంటనే భైంసా వెళ్లడానికి సిద్ధంగా ఉన్న దొడర్న పాఠశాలలో ఏఎన్‌ఎంగా పని చేసే లలిత అనే మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు యత్నించగా ఆమె కిందపడిపోయింది. అక్కడున్న వారు దొంగలను పట్టుకునేందుకు యత్నించగా వారు పారిపోయారు. నంబర్‌ప్లేట్ లేని బైక్‌పై వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పి.రవిందర్ పేర్కొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బాదనకుర్తి, మస్కాపూర్, సుర్జాపూర్, మేడంపల్లి గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు సుర్జాపూర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి


కొండుకూర్‌లో పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: రాష్ట ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అపోహలు.. వద్దని ప్రజలు ఎన్యుమరేట్లకు సహకరించి వారు అడిగిన వివరాలు చెప్పాలని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కొండుకూర్‌లో ఆమె పర్యటించారు. కార్యక్రమంలో ఎంపీవో కవిరాజు, పంచాయతీ కార్యదర్శి అరుణ, ఎన్యుమరేటర్ నిఖిల తదితరులున్నారు.

కుంటాల: ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే చేసే కుటుంబాలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వెంట ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, మండల గణాంక అధికారి సాయికృష్ణ ఉన్నారు.

మామడ: మండలంలోని బురదపల్లి, బూరుగుపల్లి, మొండిగుట్ట, గాయిద్‌పల్లి గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర సర్వేను డీఎల్‌పీవో రమేశ్ పరిశీలించారు. ఎంపీఓ గంగాసాగర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తానూరు: సర్వేలో అన్ని వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్.. ఎన్యూమరేటర్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో అబ్దుల్ సమద్, పంచాయతీ కార్యదర్శి జలం సింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సోన్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గోవింద్ అన్నారు. మండలకేంద్రంతోపాటు పాక్‌పట్లలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఎంపీవో ఖలీల్ హైమద్, కార్యదర్శులు లక్ష్మణ్, చంద్రభూషణ్‌రెడ్డి, ఎన్యూమరేటర్ హేమలత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్ పాటించాలి

- ట్రిపుల్ ఐటీ ఘటనపై ఏబీవీపీ పిలుపు

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై అనుమానాలున్నాయని కోరుతూ బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేశ్, సెక్యూరిటీ ఏజెన్సీ, లేడీవార్డెన్ చర్యలతో విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నిరసన తెలిపేందుకు వెళ్లిన ఏబీవీపీ కార్యకర్తలపై ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేయడం అమానుషమన్నారు. సాయికుమార్ అనే కార్యకర్త తల పగిలి నిజామాబాద్ ఏరియా ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎనిమిది మంది కార్యకర్తలు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని.. రాకేశ్‌ను, సెక్యూరిటీ ఏజెన్సీని వెంటనే విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని పేర్కొన్నారు.

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై నిరసనలో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లాలో విద్యాసంస్థల బంద్ పాటించాలని ఏబీవీపీ (ఎస్ఎఫ్ఎస్) జిల్లా కన్వీనర్ దుర్గప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకొని.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'మహా' ప్రచారంలో మనోళ్లు బిజీ..!


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడి ప్రచారానికి ముధోల్ నియోజకవర్గం నుంచి నేతలు తరలివెళ్లారు. ఆయా నియోజకవర్గాల్లో తమ తమ పార్టీల తరఫున ప్రచారం చేస్తూ బిజీగా గడుపుతున్నారు. ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావుపటేల్, బీజేపీ నాయకులు పలువురు మంగళవారం మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణలో మాదిరి గోస పడతారంటూ ప్రజలకు వివరిస్తున్నారు. వారి వెంట నాయకులు బి.గంగాధర్, కుంటాల మాజీ ఎంపీపీ రమణరావ్, వెంగల్‌రావ్ తదితరులు ఉన్నారు.

'సీఎంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం'


మాట్లాడుతున్న దుర్గాభవాని

కడెం: బీఆర్ఎస్ నాయకులు రైతులపై దొంగప్రేమ చూపుతూ రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని డీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు చొప్పదండి దుర్గాభవాని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో 8,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. రూ.ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి కుటుంబపాలన సాగించిన కేటీఆర్ ఇప్పుడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు వేల ఉద్యోగాలు ఇచ్చారని.. ఆరు హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓ కలెక్టర్‌పై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దాడులు చేయడం సిగ్గుచేటని.. ఆ రోపణలు మానుకొని అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

లక్ష్మణచాంద: అంబేద్కర్ సంఘం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉత్తర తెలంగాణ(ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల) అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బిర్కుల రమేశ్‌ను ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన కుంటాల శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారుగా చామన్‌పెల్లికి చెందిన పడిగెల గంగాధర్‌ను నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నిగులపు లింగన్న తెలిపారు.

న్యాయం చేయాలని నిరసన

ముధోల్: న్యాయం చేసి బాలికను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలని కోరుతూ దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవా రం ముధోల్ పోలీసు సర్కిల్ కా ర్యాలయంలో సీఐ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బాసర మండలం ఓని గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఇటీవల అదే గ్రామానికి చెందిన ఆనంద్‌పటేల్ అనే యువకుడు.. ప్రేమ పేరుతో మోసం చేసి కిడ్నాప్ చేశాడన్నాడు. అతనిపై అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసి బాలిక తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. సుంకెట పోశెట్టి, ఎమ్మార్పీఎస్ నాయకులు తూకారం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గైనీ మురళీమోహన్, దళిత ప్రజాసంఘా ల నాయకులు పురుషోత్తం , సాయిచంద్, అన్నాభావుసాతే సంఘం నాయకులు ఆనంద్, దిగంబర్, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రంజిత్ తదితరులున్నారు.

రాజులకుంటను కాపాడాలి

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రాజులకుంటను సర్వే చేయించి చెరువుశిఖం భూమిని కబ్జా కాకుండా కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రవీందర్‌కు పలువురు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. 10గుంటల చెరువు శిఖం భూమిని అదే గ్రామానికి చెందిన గంగాధర్, లక్ష్మణ్ కబ్జా చేశారని.. సర్వే చేయించి చెరువు శిఖం కబ్జా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా గంగాహారతి

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు చక్రపాణి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్తర వాహిని గౌతమి గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లి నదిలో గంగాహారతి నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలతో సిబ్బంది నిరసన


నిరసనలో తహసీల్దార్ మోతీరాం, సిబ్బంది

లోకేశ్వరం: వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ అధికారులపై దాడికి పాల్ప డిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని రెవెన్యూ సిబ్బంది డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఆర్ఐ బాలకిషన్, లలిత, సిబ్బంది ఉన్నారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్బీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. విద్యార్థి సంఘం నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరమని.. ట్రిపుల్ ఐటీలో కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ట్రిపుల్ ఐటీ గోడ దూకి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం బాసరను సందర్శించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు సింగారి వెంకటేశ్, కైలాస్, దిగంబర్, జవహర్ రాహుల్ పాల్గొన్నారు.

కనుల పండువగా వార్షికోత్సవం


వేడుక తిలకిస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండితులు కృష్ణశాస్త్రి, హరీశ్ ఆచార్య ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, మండపపూజ, జయాది హోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకంతో పాటు శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల కల్యాణం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

బస్‌పాస్ మేళా

సారంగపూర్: మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ విలేజ్ బస్ అధికారి టీవి రమణ, నిర్మల్ బస్‌స్టేషన్ మేనేజర్ ఏఆర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికే చెందిన 29మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ శంకర్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకులు సురేందర్, మారుతి, జంగు ఉన్నారు.

ఫీవర్ సర్వే

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. మంగళవారం 136 ఇళ్లను సందర్శించి నలుగురు జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించారు. అసంక్రమిత వ్యాధుల్లో భాగంగా 12 మందికి పరీక్షలు జరిపి ముగ్గురు బీపీ పేషెంట్లు, షుగర్ పేషెంట్‌ను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశామని సిబ్బంది పేర్కొన్నారు. ఇతర వ్యాధులతో బాధపడుతున్న 16 మందికి తక్షణ చికిత్స చేసి.. ఇద్దరు డయేరియా బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశామని పేర్కొన్నారు. సిబ్బంది వేణుగోపాల్, మీరాబాయి, సరస్వతి, నారాయణ, పద్మ, పార్వతి, లావణ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించగా.. ఎంఈవో నరేందర్ పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్, ఐఆర్‌పీలు రాము, భూమన్న తదితరులున్నారు.

అలుగు కూల్చివేతను అడ్డుకున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సమీపంలోని కాలువ అలుగు కూల్చివేతను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అలుగు కూల్చివేతతో నచ్చన్‌ఎల్లాపూర్ రైతులకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఈఈ విఠల్ కూల్చిన స్థానంలో మళ్లీ ని ర్మాణం చేపడతామని గ్రామస్తులకు వివరించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఖానాపూర్: బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రితేశ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో బీజేపీ పార్టీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్‌నకు హా జరై మాట్లాడారు. సభ్యత్వాల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం బాదన్‌కుర్తిలో పలువురిని పరామర్శించారు. అజ్మీరా హరినాయక్, అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, టేకు ప్రకాశ్, నాయిని సంతోష్, పడాల రాజశేఖర్, ఉపేందర్, రమేశ్, సత్యవతి, స్వామి, రవి, భూమన్న, అనిల్‌రావు, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, పవన్ ఉన్నారు.